సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 11 । జనవరి । 2025



గరుడ వాహనంపై సత్యదేవుడు


అన్నవరం: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై అన్నవరంలో ఘనంగా ఊరేగించారు.



16న అప్రెంటిస్‌షిప్ మేళా

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 16వ తేదీ ఉదయం 9 గంటల నుంచి అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.రాధాకృష్ణన్ తెలిపారు.

డెల్టాలకు 12,040 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 12,040 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే : హర్షకుమార్



మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: తిరుపతి తొక్కిసలాట ఘటనకు కారణం ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ మండిపడ్డారు. టీటీడీ చైర్మన్, ఈఓ, అదనపు ఈఓలపై క్రిమినల్ కేసులు నమోదుచేసి, వెంటనే వారిని అరెస్టు చేయాలని, లేదంటే ప్రజాప్రయోజన వ్యాజ్యం వేస్తానని ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో హెచ్చరించారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై పాలకవర్గం, అధికారులు సమావేశమై చర్యలు చేపట్టకపోవడం దారుణమని విమర్శించారు. టీటీడీ టికెట్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని హర్షకుమార్ చెప్పారు. ఇటీవల తిరుమల లడ్డూ కల్తీపై గొంతెత్తిన పీఠాధిపతులు, మఠాధిపతులు ఈ తొక్కిసలాట ఘటనపై మౌనం వహించడం సరికాదన్నారు. హైదరాబాద్‌లో హీరో అల్లు అర్జున్‌వల్ల ఒక మనిషి ప్రాణం పోయిందంటూ క్రిమినల్ కేసు పెట్టి అరెస్టు చేశారని.. మరిక్కడ తొక్కిసలాట ఘటనలో ఆరుగురు చనిపోతే ఎవరిపైనా కేసు పెట్టకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారో ప్రభుత్వం చెప్పాలని అన్నారు. అలాగే, మృతులకు రూ.25 లక్షల పరిహారం మాత్రమే ప్రభుత్వం ప్రకటించి చేతులు దులుపుకోవడం సమంజసం కాదన్నారు. తిరుపతి తొక్కిసలాటపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని, రెండ్రోజుల్లో చర్యలు తీసుకోకపోతే కోర్టులో పిటిషన్ వేస్తానని ఆయన చెప్పారు. ఇక విశాఖ పర్యటనలో ప్రధాని మోదీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై నోరెత్తకపోవడం దారుణమని హర్షకుమార్ మండిపడ్డారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మోదీ భజనకే పరిమితమయ్యారని విమర్శించారు.

మకర తోరణం సమర్పణ



మకర తోరణం, వెండి కిరీటం సమర్పిస్తున్న దాతలు

నల్లజర్ల: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారికి గ్రామానికి చెందిన పాతూరి సత్యనారాయణ, రాధ దంపతులు, వారి కుమారుడు శ్రీనివాస్, కోడలు దివ్యమాల రూ.4 లక్షల విలువైన వెండి మకర తోరణం సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ దాపర్తి వెంకటేశ్వరరావు శుక్రవారం ఈ విషయం తెలిపారు. అలాగే, మలకలపల్లి శ్రీహరి కుమారుడు శ్రీనివాస్, రాణి దంపతులు స్వామివారి విగ్రహాలకు 250 గ్రాముల వెండి కిరీటాలు సమర్పించారు.

బకాయిల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి



సమావేశంలో పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉపాధ్యాయులకు రావలసిన బకాయిల కోసం వచ్చే బడ్జెట్‌లో కేటాయింపులు జరిగే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ చెప్పారు. యూనియన్ జిల్లా 78వ వార్షిక కౌన్సిల్ సమావేశం స్థానిక డీఎంహెచ్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డేనియేల్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 19 మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఆర్థిక కార్యదర్శులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. వివిధ మండలాల నివేదికలతో పాటు రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన పీఆర్‌సీ, పెండింగ్ డీఏ బకాయిల సాధనకు చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై చర్చించామని లక్ష్మణ్ తెలిపారు. ఎస్టీయూ రాష్ట్ర మునిసిపల్ కన్వీనర్ ఎ.సూరిబాబు మాట్లాడుతూ, 100 రోజుల ప్రణాళికతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను టెన్త్ విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు.

నేటి నుంచి స్పెషల్ రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి పండగ రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి – విశాఖపట్నం మధ్య జనసాధారణ్ అన్ రిజర్వుడ్ స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి – విశాఖపట్నం (08534) రైలు ఈ నెల 11, 13, 16, 18 తేదీల్లో నడుస్తుందన్నారు. అలాగే, ఈ నెల 12, 15, 17 తేదీల్లో విశాఖపట్నం – చర్లపల్లి (08533) రైలు నడుస్తుందన్నారు. అదేవిధంగా ఈ నెల 11, 12, 16, 17 తేదీల్లో చర్లపల్లి – విశాఖపట్నం (08538) రైలు, ఈ నెల 11, 15, 16 తేదీల్లో విశాఖపట్నం – చర్లపల్లి (08537) రైలు నడవనున్నాయని వివరించారు. ఈ ప్రత్యేక రైళ్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తుని, అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు స్టేషన్ల ఆగుతాయన్నారు.

ముక్కోటి వైభవం.. భక్తజనహారం..

ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలోని వైష్ణవ ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. ముఖ్యంగా శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయాలకు వేకువజాము నుంచే అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. భారీగా బారులు తీరి మరీ స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను సుగంధభరిత పూలమాలలు, విద్యుద్దీప తోరణాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆయా ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

– సాక్షి, రాజమహేంద్రవరం



రాజమహేంద్రవరం సీతంపేటలోని జమిందార్ మెట్ట వద్ద ఉన్న ఆలయంలో ప్రత్యేక అలకరణలో వేంకటేశ్వర స్వామి



జమిందార్ మెట్ట వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తుల బారులు



రాజమహేంద్రవరం దేవీచౌక్ వేంకటేశ్వర స్వామి మఠంలో వజ్రాలంకరణలో స్వామివారు

బస్ తీమే సవాల్

- అడ్డంగా టికెట్ రేట్లు పెంచేసిన ప్రైవేటు ట్రావెల్స్
- సంక్రాంతి ప్రయాణాలను సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యాలు
- హడలెత్తిస్తున్న బస్సు చార్జీలు
- ఉమ్మడి 'తూర్పు'న ప్రయాణికుల అగచాట్లు
- హైదరాబాద్ నుంచే అధిక డిమాండ్



సాక్షి ప్రతినిధి, కాకినాడ: పండగ ప్రయాణం సగటు జనాన్ని హడలెత్తిస్తోంది. సంక్రాంతి డిమాండును ప్రైవేటు ట్రావెల్స్ విచ్చలవిడిగా 'క్యాష్' చేసుకుంటున్నాయి. మామూలు రోజులతో పోలిస్తే.. పండగ ప్రయాణికులపై అవకాశమున్న మేరకు ట్రావెల్స్ యాజమాన్యాలు బాదేస్తున్నాయి. ప్రతి పండగకూ ప్రైవేటు బస్సులలో సీటుపై 10 నుంచి 15 శాతం పెంచుకోవడం అనాదిగా వస్తున్నదే. దీనికి ప్రయాణికులు కూడా మానసికంగా సిద్ధపడేవారు. ఈసారి సంక్రాంతి పండగకు నాలుగైదు రోజుల ముందుగానే 60 నుంచి 100 శాతం వరకూ అడ్డగోలుగా రేట్లు పెంచేశారు. కొంతమంది రేట్లు పెంచుకునేందుకు సీట్లు ఖాళీ లేవని చెబుతున్నారు. ఏసీ స్లీపర్, స్లీపర్ కోచ్‌లైతే సీట్లను డబుల్ రేట్లకు అమ్ముకుంటున్నారు. రేట్ల పెంపుపై ఎవరైనా ప్రశ్నిస్తే.. వాహనాల తనిఖీలు, ఇతర ఖర్చులు తడిసి మోపెడైపోతున్నాయని, తాము మాత్రం ఏం చేస్తామని ఎదురు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ అడ్డగోలుగా చార్జీల పెంచేస్తున్నా రవాణా శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

30 వేల మంది రాక

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పలువురు ఉపాధి, ఉద్యోగాల రీత్యా వివిధ రాష్ట్రాలు, ఇతర జిల్లాల్లో నివసిస్తున్నారు. వీరందరూ సంక్రాంతి పండగకు పిల్లాపాపలతో కలసి వస్తూంటారు. ఈవిధంగా 30 వేల మంది వస్తూంటారని అంచనా. వీరిలో మూడు వంతుల మంది ఒక్క హైదరాబాద్, పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వారే ఉంటారు. మిగిలిన వారు బెంగళూరు, చెన్నై, నెల్లూరు, కృష్ణా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వస్తారు. ముఖ్యంగా జిల్లా కేంద్రాలైన కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం ప్రాంతాలతో పాటు తుని, పిఠాపురం, పెద్దాపురం, మండపేట, రామచంద్రపురం, రావులపాలెం, కొవ్వూరు, నిడదవోలు తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా సాగుతూంటాయి. సంక్రాంతికి మూడు రోజులు ముందుగానే.. అంటే శనివారం నుంచే ఇతర ప్రాంతాల నుంచి ప్రయాణికులు రావడం మొదలవుతుంది. కనుమ, ముక్కనుమ తరువాత రోజు అంటే ఈ నెల 17న తిరుగు ప్రయాణానికి డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ క్రమంలోనే సంక్రాంతికి ముందు, వెనుక మూడేసి రోజుల పాటు బస్సు ప్రయాణాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. కారణాలేవైనా ఎక్కువ మంది ఆర్టీసీ కంటే ప్రైవేటు ట్రావెల్స్‌కే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు అడ్డగోలుగా చార్జీలు పెంచేసి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. నలుగురు సభ్యులున్న కుటుంబం బస్సు ఎక్కాలంటే చార్జీలకు రూ.15 వేలు పెట్టుకోవాల్సి వస్తోందని పలువురు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు తిరుగు ప్రయాణానికి అప్పుడే అడ్వాన్స్ బుకింగ్‌లు పెరిగిపోయాయని, టిక్కెట్లు లేవని ట్రావెల్స్ నిర్వాహకులు చెప్పేస్తున్నారు.

కాకినాడ జిల్లాలో..

సంక్రాంతి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ ఈ నెల 20వ తేదీ వరకూ హైదరాబాద్ నుంచి కాకినాడ జిల్లాకు రోజుకు 35 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ సర్వీసులకు రోజువారీ చార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ హైదరాబాద్ నుంచి కాకినాడ జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం ప్రస్తుతం ఉన్న తొమ్మిదింటికి అదనంగా 68 కలిపి మొత్తం 77 బస్సులు నడుపుతోంది. వీటిని ఈ నెల 13 వరకూ హైదరాబాద్ నుంచి నడుపుతున్నారు. వీటికి మాత్రం చార్జీలు పెంచడం లేదని జిల్లా ప్రజా రవాణా అధికారి మనోహర్ చెప్పారు. ప్రైవేటు ట్రావెల్స్ కాకినాడ – హైదరాబాద్ మధ్య ప్రతి రోజూ 30 బస్సులు నడుపుతున్నాయి. బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు 6 సర్వీసులు ఉన్నాయి. సాధారణంగా జిల్లా నుంచి ప్రతి రోజూ 1,500 నుంచి 2,000 మంది హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తూంటారు. సంక్రాంతి సీజన్‌లో ఇంతకు మూడింతల మంది ప్రయాణిస్తున్నారు. సాధారణ రోజుల్లో ప్రైవేటు ట్రావెల్స్ చార్జీలు నాన్ ఏసీ రూ.900, ఏసీ రూ.1,100, స్లీపర్ రూ.1,500 ఉండేవి. సంక్రాంతి వేళ నాన్ ఏసీకి రూ.1,200 నుంచి రూ.1,500, ఏసీకి రూ.1,400, స్లీపర్‌కు రూ.2,000 వరకూ వసూలు చేస్తున్నారు.

కోనసీమ జిల్లాలో..

అమలాపురం, రావులపాలెం, రాజోలు, మలికిపురం, మండపేట, రామచంద్రపురం నుంచి సుమారు 50 ప్రైవేటు బస్సులు హైదరాబాద్ వెళ్తూంటాయి. మామూలు రోజుల్లో జిల్లా నుంచి ప్రతి రోజూ సుమారు 2,000 మంది ప్రయాణిస్తారు. సాధారణ రోజుల్లో నాన్ ఏసీ చార్జీ రూ.600 నుంచి రూ.700, స్లీపర్ రూ.1,000 నుంచి రూ.1,200, ఏసీ రూ.1,200 నుంచి రూ.1,500 ఉండేవి. పండ వేళ బస్సులను 50 నుంచి 75 వరకూ పెంచారు. దీంతోపాటే టికెట్టు రేట్లు కూడా రెట్టింపు చేసేశారు. ప్రస్తుతం నాన్ ఏసీ రూ.1,850 నుంచి రూ.2,000, స్లీపర్ రూ.2,500, ఏసీ స్లీపర్‌కు ప్రస్తుతం రూ.3,000 చెబుతున్నారు. రెండు రోజులు పోతే ఏసీ స్లీపర్ రూ.3,500 వరకూ పెంచేసే సూచనలు కనిపిస్తున్నాయి.

నిలువు దోపిడీ



హైదరాబాద్‌లో ఉంటున్నాను. ఏడాదంతా కష్టపడి పండగకు సొంతూరు వెళ్లి కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుదామనుకుంటాం. మూడు నెలల ముందు రైల్వే రిజర్వేషన్ చేసుకునే అవకాశం లేదు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులలోనే వెళ్తాంటాం. అవసరాన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేటు ట్రావెల్స్ అధిక చార్జీలతో బాదేస్తున్నాయి. ఈ ఏడాది తెలంగాణ ఆర్టీసీ కూడా టికెట్ ధర 50 శాతం పెంచింది. రూ.1,200 ఉండే టిక్కెట్టును ప్రైవేటు ట్రావెల్స్ రూ.2,500 నుంచి రూ.4,000 వరకూ పెంచేశారు.

– దొమ్మేటి సత్య శివరామ్ ప్రసాదరావు, అమలాపురం

గుండె గుభేల్



నా భర్త హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. పండగకు సొంతూరు సామర్లకోట వద్దామనుకుంటే ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ చార్జీలు రెట్టింపు పెంచేశారు. ఈ రేట్లు చూస్తే గుండె గుభేల్‌మంటోంది. ప్రైవేటు బస్సు టికెట్టు రేట్లు భారీగా పెంచేస్తూంటే ప్రభుత్వం ఏం చేస్తోంది? కుటుంబం అంతా పండక్కి వెళ్లి తిరిగి రావాలంటే ప్రయాణానికే సుమారు రూ.30 వేలు అవుతోంది. ఇక ఇతర ఖర్చులు ఎలా? ఇలాగైతే పండగ సరదాలు ఏముంటాయి? అధికారులు టికెట్టు రేట్లు నియంత్రించాలి.

– పోతిరెడ్డి సూర్య భవాని, సామర్లకోట

కఠిన చర్యలు తప్పవు



పండగ ప్రయాణికుల నుంచి ప్రైవేటు ట్రావెల్స్ అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. ఈ విషయంలో ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదు. ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాం. అయినా నిబంధనలు పాటించకుంటే బాధ్యులపై కేసులు తప్పవు. ఈ నెల 20 వరకూ రవాణా శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహిస్తారు.

– పి.సురేష్, జిల్లా రవాణా అధికారి, రాజమహేంద్రవరం

తూర్పు గోదావరిలో..

ఈ జిల్లా నుంచి ప్రతి రోజూ హైదరాబాద్‌కు అత్యధికంగా 25 ప్రైవేటు బస్సులు వెళుతున్నాయి. మరో 5 బస్సులను బెంగుళూరు, చెన్నైకి నడుపుతున్నారు. సాధారణ రోజుల్లో నాన్ ఏసీ బస్సు టికెట్టు రూ.800 ఉండగా ప్రస్తుతం రూ.2,500కు పెంచేశారు. స్లీపర్ కోచ్ టికెట్టు సాధారణ రోజుల్లో రూ.1,000 నుంచి రూ.1,500 ఉండగా.. పండుగ పేరు చెప్పి రూ.4,000 పైనే చార్జ్ చేస్తున్నారు.

ఆదిరెడ్డి అప్పారావు వ్యాఖ్యలు అనైతికం

- మా కుటుంబానికీ చరిత్ర ఉంది
- వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రవీణ్ చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్ చౌదరి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజలు ఇచ్చిన అధికారంతో మంచి చేయడానికి ప్రయత్నం చేయాలే తప్ప, అదేదో తమ సామ్రాజ్యంలా భావించకూడదని వైఎస్సార్ సీపీ నేత, పేపర్ మిల్లు యూనియన్ నాయకుడు చిట్టూరి ప్రవీణ్ చౌదరి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు చేసిన విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చారు. పేపర్ మిల్లులో ఏం జరిగిందో, అక్కడ విధి విధానాలు ఏమిటో తెలుసుకోకుండా ఇష్టమొచ్చినట్టు విమర్శలు చేయడం ఆదిరెడ్డికి తగదన్నారు. అగ్రిమెంట్ల విషయంలో లేనిపోని రభస చేయడం సరికాదన్నారు. పేపర్ మిల్లు పరంపర ఉద్యోగాలు అమ్ముకుని, నేను భరత్ వాటాలు వేసుకున్నట్లు ఆరోపించడం అర్థరహితమన్నారు. 256 మంది కార్మికుల్లో 220 మందిని సీనియార్టీ, సూటబిలిటీ ప్రకారం పర్మినెంట్ చేయించామన్నారు. గతంలో ఎప్పుడూ 50 మందికి మించి పర్మినెంట్ కాలేదన్నారు. జగదీశ్వరి హోటల్‌కు రమ్మని ఫోన్ చేసింది వాళ్లేనని, వాళ్ల పీఏ నుంచి వచ్చిన ఫోన్‌కు సాక్ష్యమిదిగో అంటూ వాయిస్ వినిపించారు. ప్రెస్‌మీట్ పెడితే చంపేస్తారా అని నిలదీశారు. తమ కుటుంబానికి ఓ చరిత్ర ఉందని, తమ తాతయ్య రెండు సార్లు రాజమహేంద్రవరం ఎమ్మెల్యేగా చేశారని గుర్తు చేశారు. నిజానికి గోరంట్ల బుచ్చయ్య చౌదరి లేకపోతే మీరెవరో జనానికి తెలుసా అని ప్రశ్నించారు. రాజకీయ భిక్ష పెట్టిన గోరంట్లనే తూలనాడడం దారుణమని అన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎన్వీ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పన ప్రభాకర్, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు డ్రోన్‌తో కషాయాల పిచికారీ



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న తాతారావు, అధికారులు

పెరవలి: ప్రకృతి వ్యవసాయంలో వరి పంటపై ఆశించే తెగుళ్లను అరికట్టటానికి డ్రోన్‌తో కషాయాలు పిచికారీ చేయిస్తున్నామని సేంద్రియ వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు తెలిపారు. మండలంలోని తీపర్రులో వరి చేలపై డ్రోన్‌తో శుక్రవారం కషాయాలు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి మండలంలోను 250 ఎకరాల్లో 6 డ్రోన్‌లతో ప్రకృతి వ్యవసాయం చేసే చేలపై డ్రోన్లతో కషాయాల పిచికారీకి ప్రణాళిక రూపొందించామని తెలిపారు. దీని వలన రైతులకు ఖర్చు తగ్గుతుందని, మందు పిచికారీ ప్రతి దుబ్బుపై జరిగి, తెగుళ్లకు అడ్డుకట్ట పడి, మంచి దిగుబడి లభిస్తుందని చెప్పారు. వరి పైరుపై వేప గింజల పొడి, ఇంగువ, చేప బెల్లం ద్రావణాన్ని పిచికారీ చేయటం వలన కాండం తొలుచు, రసం పీల్చే పురుగుల నివారణ జరుగుతుందన్నారు. జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ మాట్లాడుతూ, వరిపై ఆశించే మాగుడు తెగులు, కాండం తొలిచే, రసం పీల్చే పురుగుల నివారణకు ప్రకృతి వ్యవసాయ కషాయాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, వావిలి కషాయాలను జీవామృతంతో కలిపి పిచికారీ చేస్తే వరిపై ఎటువంటి తెగుళ్లనైనా నివారించవచ్చని వివరించారు. మోడల్ మేకర్ ఉమా మహేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జి మహాలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీమన్నారాయణకు ముఖేష్ అవార్డు



శ్రీమన్నారాయణ దంపతులను సత్కరిస్తున్న జిత్ మోహన్ మిత్రా తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ గాయకుడు, నటుడు వానపల్లి శ్రీమన్నారాయణను గానగంధర్వ ముఖేష్ స్మారక పురస్కారంతో ఘనంగా సత్కరించారు. జిత్ మోహన్ మిత్రా కళావేదికపై శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి నట గాయకుడు, ఆర్కెస్ట్రా పితామహుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్రా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా టీవీ శేషగిరి, విశిష్ట అతిథిగా పీవీఎస్ కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిత్ మాట్లాడుతూ, తన పాటలతో బాలీవుడ్‌లో చెరగని ముద్ర వేసిన ముఖేష్ పురస్కారాన్ని సీనియర్ గాయకుడు శ్రీమన్నారాయణకు అందించడం ఆనందకరమని అన్నారు. గాయనీ గాయకులు డాక్టర్ వంక, గుంటూరి శ్రీనివాస్, పోస్టల్ ప్రసాద్, డాక్టర్ నళిని, డాక్టర్ హరి, మనస్విని పలు పాటలు పాడి ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో జల్లి శివప్రసాద్, వి.జగపతి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం పరిశీలన బృందం రాక



మధురపూడి విమానాశ్రయానికి వచ్చిన పార్లమెంటు సభ్యుల బృందం

మధురపూడి: పోలవరం ప్రాజెక్టు ప్రాంత పరిశీలనకు చైర్‌పర్సన్ రాజీవ్ ప్రతాప్‌రూడీ నేతృత్వంలోని కేంద్ర నీటి వనరుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం మధురపూడి విమానాశ్రయానికి వచ్చారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, కలెక్టర్ పి.ప్రశాంతి స్వాగతం పలికారు. అనంతరం బృంద సభ్యులతో రాజమహేంద్రవరం వెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ చైర్ పర్సన్ రాజీవ్ ప్రతాప్ రూడీ నేతృత్వంలో బృందం రెండు విడతలుగా వచ్చినట్టు, శనివారం ఉదయం పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి పరిశీలన నిమిత్తం వెళ్లనున్నట్టు తెలిపారు. బృందంలో రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు ఉన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న గాలింపు



గాలింపును పర్యవేక్షిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో దూకిన వ్యక్తి కోసం శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు గాలింపు కొనసాగిస్తున్నారు. పెదపూడిలో లోకల్ పేపర్ విలేకరిగా పనిచేస్తున్న షేక్ సలీమ్ (36) గురువారం రాత్రి స్థానిక రైల్వే గేటు ఎదురుగా ఉన్న గోదావరి కాలువపై ఉన్న నూతన వంతెన నుంచి గోదావరి కాలువలో దూకిన విషయం విదితమే. గురువారం రాత్రి నుంచి బంధువులతో పాటు పోలీసులు గోదావరి కాలువలో గాలిస్తున్నారు. అయితే శుక్రవారం సాయంత్రం వరకు సలీమ్ ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు. చనిపోయి ఉంటే మృతదేహం గోదావరి కాలువలో తేలుతుందని పోలీసులు అంటున్నారు. మృతదేహం గోదావరి కాలువలో లేక పోవడంతో కాలువలో దూకిన వ్యక్తి ఈత కొట్టు కొంటూ బయటకు వచ్చి ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎండీయూ ఆపరేటర్ల సంఘ అధ్యక్షుడిపై చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న సామర్లకోట తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: పట్టణ ఎండీయూ ఆపరేటర్ల సంఘ అధ్యక్షుడిపై చర్యలు తీసుకోనున్నట్టు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా సివిల్ సప్లయ్ కార్యాలయం నిర్వహణకు ఎండీయూ ఆపరేటర్ నుంచి రూ.200 చొప్పున అతడు వసూలు చేసినట్టు తెలిసిందని, ఈ మేరకు అతనిపై చర్యలకు నిర్ణయించినట్టు తెలిపారు. అధికారుల పేరుతో సొమ్ము వసూలు చేస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. విలేకర్ల సమావేశంలో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ కమల పాల్గొన్నారు.

సంక్రాంతి పల్లెకరింపు

- గ్రామాలకు సంక్రాంతి అతిథులు
- సంప్రదాయాలకు ప్రతీకగా వేషధారణలు

ముమ్మిడివరం: 'హరిలో రంగ హరీ.. శ్రీమద్రారమణ గోవిందో హరీ' అంటూ సందడి చేసే హరిదాసు సంకీర్తనలు.. హుందాగా నడచుకుంటూ వచ్చే డూడూ బసవన్నలు..అంబ పలుకు జగదంబ పలుకు ...కాశీ అన్నపూర్ణ పలుకు..అంటూ జంగమ దేవర శంఖారావాలు.. కొమ్మదాసరుల అతిశయోక్తులతో కూడిన ప్రసంగాలు గ్రామాలకు సంక్రాంతి శోభను తెస్తున్నాయి. ధనుర్మాసం చివరి అంకం సమీపించడంతో గ్రామాల్లో వివిధ వేషధారణలతో వీరు చేసే సందడి అంతా ఇంతా కాదు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అరుదుగా ఉండే జంగమ దేవరలు ధనుర్మాసం ప్రారంభమైన నాటినుంచి తెల్లవారు జామున గ్రామాల్లో శంఖారావం చేస్తూ ఇంటింటికి తిరిగి కుటుంబ సభ్యులు, పిల్లాపాపలు చల్లగా ఉండాలంటూ శంఖారావంతో శివున్ని కీర్తిస్తూ దాతలను ఆశీర్వదిస్తుంటారు. జిల్లాలో అనేక ప్రాంతాలకు చెందిన హరిదాసులు గ్రామాల వారీగా ఇంటింటికి తిరుగుతూ హరినామ కీర్తనలతో అలరిస్తుంటారు. గ్రామాల్లో హరిదాసులకు బియ్యం సమర్పించడం సర్వసాధారణం. ఉదయం వేళ వీరి సందడి తరువాతే పల్లెల్లో పండగ పనులు మొదలు పెట్టడం పలు ప్రాంతాల్లో ఆచారంగా ఉంది. గ్రామాల్లో మహిళలు తమ వాకిళ్లలో కళ్లాపు జల్లి రంగురంగుల ముగ్గులతో సంక్రాంతి కళ తీసుకువస్తున్నారు. ధనుర్మాసం మొదలు కొని గ్రామాల్లో ఇప్పటికే సంక్రాంతి సందడి మొదలైంది. పిల్లలు ఆవు పేడతో పిడకలు వేసి భోగిదండలు తయారు చేసుకొనే పనిలో పడ్డారు. మొత్తం మీద గ్రామీణ ప్రాంతాలు సంక్రాంతి సందడితో శోభాయమానంగా తయారవుతున్నాయి.



సంకీర్తనలతో హరిదాసు



జంగమదేవర వేషధారణలో



బుడబుక్కల వేషధారణలో



డూడూ బసవన్నల సందడి

ఈ హరిదాసు..మన జవాన్!



హరిదాసు వేషధారణలో బీఎస్ఎఫ్ జవాను



బెజవాడ సతీష్ (ఫైల్)

నల్లజర్ల: మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజెప్పే మూడోతరం హరిదాసు బెజవాడ సతీష్. ఈయన స్వగ్రామం భద్రాచలం సమీపంలోని రామనగరం. వృత్తి రీత్యా సతీష్ సరిహద్దు జవాన్. సంక్రాంతి పర్వదినాలలో సెలవుపై వచ్చి మండలంలోని చీపురుగూడెం, పోతవరం, కవులూరు తదితర గ్రామాలలో తిరుగుతుంటాడు. తాత చిన్ని కృష్ణ తర్వాత తండ్రి నరసింహారావు.. ఆయన గతించిన తర్వాత సతీష్ ఈ వృత్తిలోకి వచ్చారు. ఎంత చదివినా, ఏ ఉద్యోగం చేస్తున్నా వంశపారం పర్యంగా వచ్చిన ఈ వృత్తిని సతీష్ వీడలేదు. తెల్లవారుఝామున 3గంటలకే నిద్రలేచి స్నానాధి, పూజాకార్యక్రమాలు ముగించి అల్పాహారం తిన్నాక హరినామ సంకీర్తనలు పాడుతూ గ్రామగ్రామాన తిరుగుతుంటాడు. దాదాపు 10 గ్రామాలు తిరిగాక శిరస్సుపై ఉంచిన కలశాన్ని దించి మళ్లీ స్నానం చేశాకే భోజనం చేస్తారు. ఇది తమకు ఆనవాయితీగా వస్తున్న ఆచారమని సతీష్ వివరించారు. ఇటీవల హరిదాసులంతా మోపెడ్లపై తిరుగుతూ హరినామ సంకీర్తనలు సైతం రికార్డు చేసి లౌడ్ స్పీకర్లలో వినిపిస్తూ ఉంటే ఈయన మాత్రం కాలినడకనే హరినామ సంకీర్తన చేస్తూ తిరుగుతూ కనిపిస్తారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమ తండ్రి ఈ విధంగానే తిరగాలని చెప్పారని వివరించారు. తాత, తండ్రిల నుంచి వచ్చిన తంబూర, చిడతలు, కలశం ఆయన ఇపుడు వినియోగిస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260


పవన్ చేతికి పచ్చబుక్!



పవన్‌కల్యాణ్‌కు హామీల బుక్‌ను అందజేస్తున్న వర్మ

పిఠాపురం: కూటమి పాలనలో రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుంటే తామేమీ తక్కువ కాదు అనుకున్నారో ఏమో పిఠాపురం టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వర్మ పచ్చబుక్ తయారు చేశారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి శుక్రవారం పిఠాపురం వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు దాన్ని అందజేశారు. ఇంతకీ అందులో ఏముందని ఆరా తీస్తే గత ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ తరపున టీడీపీ నేతలు ఇచ్చిన హామీల చిట్టా అని తేలింది. ఇన్ని హామీలు ఇచ్చి నెగ్గించాం.. వాటిని పరిష్కరించకపోతే బాగోదన్నట్లుగా ఒక విధంగా పవన్‌ను హెచ్చరించే విధంగా ఆ బుక్ ఇచ్చినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. ఒక పుస్తకం తయారు చేసేంత హామీలు ఇచ్చారా? అన్ని హామీలు ఇస్తేనే గాని నెగ్గలేకపోయారా? అంటూ స్థానికులు టీడీపీ నేత తీరుకు ముక్కున వేలేసుకుంటున్నారు.

నేత్రదానం



సత్యనారాయణ (ఫైల్)

కె.గంగవరం: పామర్రుకు చెందిన తూము వీరవెంకట సత్యనారాయణ (80) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. కాకినాడకు చెందిన బాదం ఐ బ్యాంక్ నిపుణులు మృతుని నేత్రాలను సేకరించారు. దాతలను అభినందించారు.

ఉరకలేసిన ఉత్సాహం

గండేపల్లి: ఉరకలెత్తే ఉత్సాహం, చలికే చెమటలు పట్టించే జోష్, జోరు పెంచిన విద్యార్థుల నృత్యాలు, ప్రదర్శనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. చూపరుల కంటి రెప్పను మూయలేని విధంగా సంప్రదాయ, వివిధ రకాల ఫ్యాషన్ దుస్తుల్లో విద్యార్థులు అలరించారు. నవ్వులు పూయించే స్కిట్స్ ఆద్యంతం సరదా సరదాగా సాగాయి. విద్యార్థులతోపాటు తల్లితండ్రులు, పలు గ్రామాల నుంచి కార్యక్రమాలను తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు. జనసందోహం, విద్యార్థులు, అధ్యాపకులతో ఆదిత్య ప్రాగణం జన సంద్రంగా మారింది. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో రెండవ రోజు శుక్రవారం కలర్స్–2025 కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

స్పోర్ట్స్, గేమ్స్

స్పోర్ట్స్, గేమ్స్ విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో పురుషుల విభాగంలో కేఎల్ యూనివర్సిటీ, మహిళల విభాగంలో ఆదిత్య యూనివర్సిటీ ప్రథమ స్థానంలో నిలిచినట్టు ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, త్రో బాల్ విభాగంలో గెలుపొందినవారికి బహుమతులు అందజేసిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ రమేష్, డీన్‌లు పాల్గొన్నారు.

రడీమేడ్ భోగి పిడకల్!

సంక్రాంతి పండగకు ముందు వచ్చే భోగి రోజున అందరూ మంట వద్దకు వెళ్లి ఆవు పిడకల దండలు వేస్తుంటారు. గతంలో ముందుగానే పల్లెల్లో ఆవుపేడతో భోడిపిడకలను తయారు చేసుకుని దండలు కట్టి మంటల్లో వేసేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీంతో భోగి పిడకలు మార్కెట్‌లో విక్రయిస్తుండడంతో వాటిని కొనుగోలు చేసి మంటల్లో వేస్తున్నారు. చిన్నదండ రూ.50, పెద్దదండ రూ.100కు విక్రయిస్తున్నట్లు వ్యాపారి శ్రీను తెలిపారు. ప్రతి ఏడాది భోడిపిడకలు అమ్ముతున్నట్లు ఆయన తెలిపారు.

–ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)



రాజమహేంద్రవరం వీఎల్ పురం సెంటర్‌లో విక్రయిస్తున్న భోగి పిడకలు

బరిలో రంగ సిరి!



గోపాలపురం తహసీల్దార్ అజయ్‌బాబుకు వినతి పత్రం అంజేస్తున్న సర్పంచ్ మణెమ్మ



గోపాలపురం మండలం వాదాలకుంటలో కోడిపందేలకు సిద్ధం చేసిన బరులు

గోపాలపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అధికార టీడీపీ నాయకుల ఆగడాలకు అడ్డుఅదుపూ లేకుండా పోయింది. గ్రామాల్లో మట్టి అక్రమ వ్యాపారాలతో సొమ్ము చేసుకున్న నేతలు సంక్రాంతిని కూడా విడిచిపెట్టడం లేదు. సంక్రాంతి మరికొన్ని రోజులు ఉండగానే అధికార పార్టీ నాయకుల అండదండలతో పల్లెల్లో కోడి పందేలకు బరులు సిద్ధం చేయడం, గుండాట, పేకాట స్థావరాలు ఏర్పాటు చేయడం వంటివి యథేచ్ఛగా సాగుతున్నాయి. కోడిపందేల నిర్వహణ మొత్తం గుండాటపైనే ఆధారపడి ఉంది. ఒక్కో బరిలో గుండాట వేయడానికి చిన్న బరులైతే రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు, పెద్ద కోడిపందేల బరులైతే రూ.30లక్షల నుంచి రూ.60 లక్షల వరకూ పలుకుతోంది. అంతేకాకుండా గుండాట నిర్వాహకుల మధ్య వేలం నిర్వహించి మరీ కోడిపందేల నిర్వహకులు జేబులు నింపుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ అధికారుల ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు తప్ప వారిపై చర్యలకు ఉపక్రమించే ధైర్యం చేయడం లేదు.

మా గ్రామంలో నిర్వహించవద్దంటూ సర్పంచ్ వినతి

మా గ్రామంలో కోడిపందేలు, గుండాట, పేకాట స్థావరాలు ఏర్పాటు చేయవద్దని గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామ సర్పంచ్ జొన్నకూటి మణెమ్మ శుక్రవారం గోపాలపురం తహసీల్దార్ కె.అజయ్‌బాబు, పోలీసులకు వినతి పత్రాలు అందజేశారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల గ్రామంలో వర్గ విభేదాలు పెరిగిపోతాయని, కోడి పందేలకు ఏర్పాటు చేసిన బరులను తొలగించాలంటూ ఆమె వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామంలో ఇప్పటికే వర్గ విభేదాలతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని కోడి పందేలు నిర్వహించడం వల్ల మరిన్ని అల్లర్లు చెలరేగుతాయని ఆమె వివరించారు.

హైలెస్సో.. హైలెస్సా



పడవలతో సాధన చేస్తున్న క్రీడాకారులు

సాక్షి, అమలాపురం: మధ్య డెల్టా ప్రధాన పంట కాలువ. ఇరువైపులా ప్రధాన రహదారులు. వాటిని ఆనుకుని రంగురంగుల పూల మొక్కలు. వాటిని ఆనుకుని కొబ్బరి చెట్లు.. వరిచేలు.. కోనసీమ మొత్తం అందాలన్నీ ఇక్కడే అన్నట్టుగా కనిపించే సుందర దృశ్యాలు బొబ్బర్లంక బ్యారేజ్ నుంచి లొల్లలాకుల మధ్యనే ఉంటాయి. ఇటువంటి చోట పంట కాలువలో కేరళ తరహాలో పడవల పోటీ నిర్వహణకు పర్యాటక శాఖ సిద్ధమైంది. సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పడవల పోటీలు శనివారం ప్రారంభం కానున్నాయి. 13వ తేదీ భోగి వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతోపాటు విజయవాడ, విశాఖ, అనంతపురం నుంచి పలువురు పాల్గొననున్నారు. లొల్ల లాకుల నుంచి ఉచ్చిలికి మధ్యలో ఈ పోటీలు జరగున్నాయి. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఇప్పటికే చేరుకుని సాధన చేస్తున్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నారు. పోటీలకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు.

విద్యార్థిని దుర్మరణం



వైష్ణవి (ఫైల్)

నల్లజర్ల: గురుకుల పాఠశాలలో చదువుతూ సంక్రాంతి సెలవులకు ఇంటికి వస్తున్న విద్యార్థి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ద్వారకాతిరుమల మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన ఉండి శ్రీనివాసరావు వ్యవసాయ కూలీగా పనిచేస్తుండగా అతని భార్య లలిత కుమారి ఉపాధి నిమిత్తం కువైట్‌లో ఉంటోంది. పెద్ద కుమార్తె ఐశ్వర్య ద్వారకాతిరుమల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతుండగా చిన్న కుమార్తె వైష్ణవి(13) నర్సాపురంలో గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. పాఠశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో వైష్ణవి అమ్మమ్మ గురువారం పాఠశాల నుంచి వారి ఊరైన నల్లజర్ల మండలం నబీపేటకు తీసుకువచ్చింది. శుక్రవారం ఉదయం విద్యార్థి తండ్రి శ్రీనివారావు బైక్‌పై నబీపేట వచ్చి వైష్ణవిని తీసుకొని గొల్లగూడెం బయలు దేరి వెళ్తుండుగా నల్లజర్ల శివారు భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా బైక్ అదుపుతప్పి లారీ వెనుక చక్రాల కింద పడింది. తీవ్రగాయాలతో వైష్ణవి అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి శ్రీనివాసరావు గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న వైష్ణవి అక్క ఐశ్వర్య ఘటనా స్థలానికి వచ్చి విలపిస్తున్న తీరు అక్కడి వారిని కలచివేసింది. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ సోమరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైఫ్@360

● మీకు తెలుసా

ఎండు పండ్లు ఎంత ఆరోగ్యం?

ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి తగినన్ని ప్రొటీన్స్, ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్ అవసరం. వీటన్నింటిని పొందడానికి డ్రై ఫ్రూట్స్ ఒక మంచి ఆప్షన్. అందుకే డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి మంచిదని డాక్టర్లతోపాటు చాలామంది తెలిసిన వాళ్లు కూడా చెబుతారు. అయితే అవి ఆరోగ్యానికి మంచిది కదా అని.. ఇష్టమొచ్చినట్టు తింటే



ఆరోగ్యానికి మేలు బదులు ముప్పు వాటిల్లుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

అతి సర్వత్రా వర్జయేత్ అన్నారు పెద్దలు. అంటే ఎందులోనూ అతి పనికి రాదన్నమాట. ఈ సూత్రం డ్రై ఫ్రూట్స్‌కి కూడా వర్తిస్తుంది.

డ్రై ఫ్రూట్స్‌లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే.. షుగర్స్, క్యాలరీ లు కూడా ఉంటాయి. కాబట్టి వీటిని 20 గ్రాముల కంటే ఎక్కువ తినకూడదు. అలాగే నేరుగా తినడం కూడా మంచిది కాదు.



స్విచాఫ్ ది ఫోన్!

ఓపెన్ ది మైండ్!

ప్రస్తుత కాలంలో ఫోన్‌తోనే ప్రతి ఒక్కరికీ పని. స్మార్ట్ ఫోనే ఫ్రెండ్. ఫోనే పార్ట్‌నర్. సెల్లే సర్వస్వం. అయితే ఓ రోజు ఫోన్ లేకుండా గడిపితే ఎలా ఉంటుంది. వారంలో ఓ రోజు పనికి సెలవు తీసుకున్నట్లే ఫోన్‌కి స్విచ్ ఆఫ్ చేసి పక్కన పడేస్తే..? వారాంతంలో ఓ రోజు పనికి దూరంగా ఉన్నట్లే ఫోన్‌కు దూరంగా ఉంటే ఎలా ఉంటుంది.. అనే ఆలోచన ఊహించడానికే ఏదోలా ఉంది కదా... అదేం కాదు.. ఫోన్ లేకపోతే ఏం జరుగుతుందో చూద్దాం.

చేతిలో ఫోన్ లేకపోతే మెదడు ఓపెన్ అవుతుంది. సొంతంగా ఆలోచించడం ఆరంభం అవుతుంది. ఒకదానితో మరొక విషయాన్ని బేరీజు వేసుకోవడం మొదలుపెట్టే ఖాళీని మెదడుకు ఇచ్చి చూద్దాం.

సెలవు రోజు ఇంటికి అవసరమైన వస్తువులు తెచ్చుకోవడం లేదా ఆర్డర్ చేసుకోవడం వంటి పనులు పూర్తి చేసుకున్న తర్వాత ఇక ఆ రోజుకు ఫోన్ ముట్టుకోవద్దు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇంట్లో పెట్టి కాలనీలో రోడ్లన్నీ చుట్టి వస్తే... మనం నివసించే ప్రదేశం ఎలా ఉందో తెలుస్తుంది. కొత్తగా కడుతున్న ఓ భవనం కనిపిస్తుంది. ఇంతకు ముందు ఈ ప్రదేశంలో ఏముందేది? ఓ ప్రశ్న మదిలో మెదలుతుంది. కానీ సమాధానమే తట్టదు. గడచిన పదేళ్లుగా ఇదే కాలనీలో ఉన్నప్పటికీ వారంలో పది–పదిహేను సార్లు ఇదే దారిలో ప్రయాణించినప్పటికీ మనం ఈ ప్రదేశానికి చిరపరిచితులం కాలేకపోయామా అనే సందేహం కూడా అనిపిస్తుంది. నిజానికి ఈ ప్రదేశానికి మనం చిరపరిచితులయ్యాం, కానీ మనకే ఈ ప్రదేశం చిరపరిచితంగా మారలేకపోయింది. ఒక్కరోజైనా చేతిలో ఉన్న ఫోన్‌ని జేబులో పెట్టుకుని ఈ దారిలో



నడిచి ఉంటే కదా! ఏ విషయమైనా మెదడు గ్రహింపుకు వచ్చేది. అనుక్షణం కళ్లు, చెవులు, మెదడు ఫోన్‌తో ఎంగేజ్ అయి ఉంటాయి. అలవాటు పడిన దారిలో దేహం యాంత్రికంగా సాగిపోతూ ఉంటుంది. పనులు ముగించుకుని ఇంటికి వచ్చి కూర్చున్న తర్వాత కూడా టీవీ స్క్రీన్ మీద దృష్టి కేంద్రీకరిస్తాం. ప్రపంచంలోని విషయాలన్నింటినీ మెదడులోకి గుప్పించడంలోనే రోజు పూర్తవుతుంటే... ఇక మెదడు సొంతంగా ఆలోచించేదెప్పుడు? ఆ మాత్రం వెసులుబాటు దొరికినప్పుడే మెదడు తన సృజనాత్మకతను బయటపెడుతుంది.

ఒక గంటతో మొదలు పెట్టండి!

వారంలో ఓ రోజు ఫోన్, టీవీ, కంప్యూటర్, ట్యాబ్, ల్యాప్‌టాప్ అన్నింటికీ సెలవు ప్రకటించి తీరాలి. మెదడుకు రెక్కలు విచ్చుకుని విహరించే అవకాశం కల్పించాలి. ఒకేసారి రోజంతా అన్ని స్క్రీన్‌లకూ ఆఫ్ అంటే కొంత కష్టం కావచ్చు. టీవీ, కంప్యూటర్ లైతే మన చేతిలోనే ఉంటాయి. ఫోన్ కాల్స్ మన చేతిలో ఉండవు. ఇంట్లో ఒక ఫోన్ స్విచాఫ్‌లో ఉంటే 'ఫోన్ ఆఫ్‌లో ఉందేమిటి' అంటూ మరొకరి ఫోన్‌కు కాల్స్ వస్తుంటాయి. కాబట్టి మొదట్లో ఒక గంటతో మొదలు పెట్టండి. రెగ్యులర్‌గా ఫోన్ చేసే స్నేహితులు, బంధువులకు 'ఇది స్విచాఫ్ అవర్' అని మెసేజ్ పెట్టేసి ఫోన్ బంద్ చేయాలి. గంటతో మొదలు పెట్టి క్రమంగా 'స్విచాఫ్ డే'గా మార్చాలి. 'స్విచాఫ్ డే' కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకునే రోజవుతుంది. కుటుంబ బంధాలు ఆనందాల హరివిల్లుగా మారుతాయి.

యోగా

నేలపైన మ్యాట్ వేసుకొని, శరీరాన్నంతా స్ట్రెచ్ చేస్తూ చేయాలని అందరూ యోగా చేయడానికి సిద్ధ పడరు. అందుకు వయసు, అనారోగ్యం, చిన్న చిన్న గాయాలు వంటివి కారణం అవుతుంటాయి. ఇలాంటప్పుడు కుర్చీ లేదా సోఫాలో కూర్చొని కూడా యోగ సాధన చేయవచ్చు.

ఈగిల్ ఆర్మ్స్ భంగిమ అంటే ఇది గరుడాసనను పోలిన విధంగా ఉంటుంది. ఇందులో కూర్చొనే విధానంలోనే తేడా ఉంటుంది. శరీర కదలికలకు, శ్వాస పనితీరులో మెరుగుకు ఇలా సాధన చేయవచ్చు.

భుజబలానికి కీలకం





ఇలా ప్రయత్నించవచ్చు..

● కుర్చీలో నిటారుగా కూర్చొని, పాదాలను నేలమీద ఆనించాలి. దీర్ఘశ్వాస తీసుకుని, వదులుతూ చేతులను విశాలంగా గరుడ పక్షి రెక్కల్లా చాచాలి. భుజాలను నిటారుగా ఉంచాలి.

● ఐదు శ్వాసలు తీసుకొని, వదిలిన తర్వాత రెండు చేతులను పైకి ఎత్తాలి. చేతులను సాధ్యమైనంత పైకి సాగదీస్తున్నట్టు ఉంచాలి. ఆ తర్వాత రెండు చేతులను హృదయస్థానానికి తీసుకురావాలి. కుడి చేతిని ఎడమ చెయ్యి కింద నుంచి తీసుకుంటూ వ్యతిరేక దశలో రెండు చేతులను పట్టుకోవాలి. ఈ సమయంలో భుజాలు కూడా కొద్దిగా ముందుగా వంగుతాయి. ఈ భంగిమను రోజూ సాధన చేస్తుంటే ముంజేతుల దగ్గర నుంచి ఒకదాన్నొకటి చుట్టినట్టుగా వస్తుంది. ఐదు దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదలాలి. తిరిగి మెల్లగా యథాస్థితికి రావాలి.

● ఇదే విధంగా ఎడమ నుంచి కుడి చేతివైపుకు కూడా చేయాలి. ఒక్కో భంగిమలో ఐదు దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదులుతూ సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుంది.

● కుర్చీ/సోఫాలో కూర్చున్నప్పుడు కాళ్లను కూడా నేల మీద నుంచి వీలైనంత పైకి లేపి, పది సెకన్లు ఉంచి, తిరిగి యథాస్థానంలోకి తీసుకురావచ్చు. ఈ విధంగా చేయడం వల్ల పాదాల వరకు రక్త ప్రసరణ మెరుగవుతుంది.

పాలు... రాగులు ఏవి బెటర్

శరీరానికి కాల్షియం అనేక రోజువారీ పనులు చేసేందుకు ఉపకరిస్తుంది. అందువల్ల మన డైట్‌లో కాల్షియంని చేర్చుకోవడం ముఖ్యం. జున్ను, బొప్పాయి, మల్బరీ, లిచీ, కివి, బచ్చలికూర, బ్రకోలీలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. వీటిని రెగ్యులర్‌గా తినడం వల్ల చాలా సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. ఆరోగ్యంగా కూడా ఉంటారు.

పాలు, రాగుల్లో కాల్షియం ఎక్కువగా ఎందులో ఉంటుందంటే...

పాలు, రాగులు రెండూ ఒకదానికి మించి లాభాలని అందిస్తాయి. ఉదాహరణకి..100 మి.లీ పాలు తాగితే 110 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. అదే 100 గ్రాముల రాగులని తీసుకుంటే, దాదాపు 350 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థని ఆరోగ్యంగా ఉంచితే, ఐరన్ ఎక్కువగా ఉండడం వల్ల రక్తహీనత ఉన్నవారికి రాగులు మంచిది. రాగుల్లో ఉండే పొటాషియం వంటి ఇతర పోషకాలు మొత్తం శరీర ఆరోగ్యానికి సాయపడతాయి. పాలలో పోషకాలతోపాటు ఉండే ఎలక్ట్రోలైట్స్ బాడీని హైడ్రేట్ చేస్తాయి. రాగులు షుగర్ ఉన్నవారికి చాలా మంచిది. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉండి గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది బ్లడ్ షుగర్ లెవల్స్‌ని నియంత్రిస్తుంది కాబట్టి, మీ అవసరాలని బట్టి ఏది మంచిదో నిర్ణయించుకోవడం ఉత్తమం.



తొక్కలతో మొక్కలకు పోషణ

చాలా మంది వేరుశెనగ పప్పుల్ని తిని.. వాటి తొక్కల్ని పారేస్తుంటారు. అయితే, మనం వేస్ట్ అనుకున్న ఈ తొక్కలతో చాలా ప్రయోజనాలు ఉన్నాయి. వేరుశెనగ తొక్కల్లో నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఉన్నాయి. ఇవి మొక్కల ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సాయపడతాయి. అంతే కాకుండా వీటిలో ఫైబర్, ప్రొటీన్ కూడా ఉన్నాయి. ఇవి మొక్కలకు తగిన పోషణ ఇస్తాయి. వేరుశెనగ తొక్కల్ని ఉపయోగించి కంపోస్ట్ ఎరువు తయారు చేయవచ్చు. ఇందుకోసం వేరుశెనగ తొక్కల్ని బాగా ఎండబెట్టాలి. ఆ తర్వాత వీటిని బాగా మెత్తగా పొడిలా చేసుకోండి. ఈ పొడిని ఇప్పుడు డైరెక్ట్‌గా కుండీలోని మట్టిలో కలపవచ్చు. వేరుశెనగ తొక్కల పొడిని వాడే ముందు మట్టి బాగా కలియబెట్టాలని మరచిపోకూడదు. ఇలా చేయడం వల్ల మొక్కలకు తగిన పోషణ అంది బాగా పచ్చగా, ఏపుగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.



మరకలు ఇలా మాయం..

ఉన్ని దుస్తుల మీద మరకలు ఏర్పడితే.. వాటిని డైరెక్ట్‌గా వాషింగ్ మెషిన్‌లో ఉపయోగించకూడదు. వాషింగ్ మెషిన్‌లో వేయడానికి ముందు.. సాఫ్ట్ స్టెయిన్ రిమూవర్‌తో మరకల్ని తొలగించాలి. తేలికపాటి లిక్విడ్ డిటర్జెంట్, నిమ్మరసం వంటి వాటిని అప్లై చేసి.. స్టెయిన్ రిమూవర్‌తో మరకల్ని తొలగించడం బెస్ట్ ఆప్షన్. ఆ తర్వాత మరకలు తొలగిన తర్వాత వాష్ మెషిన్‌లో వేసి బట్టలు ఉతకవచ్చు.



మీకు తెలుసా?

చాలా మంది కూల్ డ్రింక్స్ తాగుతుంటారు. అందులోనూ సోడా ఉండే వాటిని ఎక్కువ మంది ఇష్టంగా తీసుకుంటారు. వేసవికాలం, చలికాలం అనే సంబంధం లేకుండా వీటి వాడకం ఎక్కువగా ఉంటుంది. వీటి వల్ల కలిగే ప్రయోజనాల కన్నా... ఆరోగ్య సమస్యలే ఎక్కువ. కూల్ డ్రింకులు, సోడాలు, చక్కెర పానీయాలు తాగడం వల్ల మధుమేహం,ఊబకాయం, కొవ్వు పెరిగి కాలేయం, మెటబాలిక్ సిండ్రోమ్ ప్రమాదాన్ని పెంచుతుంది. కొందరు సోడాకు బదులు డైట్ సోడా తాగితే ఆరోగ్యంపై అంతగా ప్రభావం ఉండదని అనుకుంటూ ఉంటారు. కానీ, మెటబాలిక్ సిండ్రోమ్, అలాగే స్ట్రోక్ ప్రమాదాలను పెంచుతుందని పలు అధ్యయనాల్లో తేలింది. మరి కొన్ని పరిశోధనల ప్రకారం, డైట్ సోడా వినియోగం కూడా ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదాన్ని పెంచుతుంది.



సాక్షి సినిమా

డాల్బీ విజన్‌లో సినిమా చూడటం భిన్నమైన అనుభవం

– రాజమౌళి



''ఆర్ఆర్ఆర్' సినిమాని డాల్బీ విజన్‌లో గ్రేడ్ చేయాలనుకున్నప్పుడు జర్మనీ వరకు ప్రయాణించాల్సి వచ్చింది. మన దేశంలో డాల్బీ విజన్‌లో నా సినిమాను ఎక్స్‌పీరియన్స్ చేయలేకపోవడం కొంచెం నిరుత్సాహపరిచింది. ఇప్పుడు అన్నపూర్ణ స్టూడియోస్‌లో డాల్బీ విజన్ గ్రేడింగ్ సౌకర్యాన్ని చూసి థ్రిల్ అయ్యాను'' అని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి చెప్పారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ హైదరాబాద్‌లో సినిమా–హోమ్ కోసం భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీ స్టూడియోను నెలకొల్పింది. అన్నపూర్ణ స్టూడియోస్ వైస్ చైర్మన్, హీరో నాగార్జున అక్కినేని సమక్షంలో ఈ స్టూడియోను రాజమౌళి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ– ''డాల్బీ విజన్‌లో సినిమా చూడటం భిన్నమైన అనుభవం. స్పష్టత, ప్రతి ఫ్రేమ్‌లోని సూక్ష్మ నైపుణ్యాలను పెంచే విధానం కథను పూర్తిగా కొత్త స్థాయికి తీసుకువెళుతుంది. నా తర్వాతి సినిమా విడుదలయ్యే సమయానికి భారతదేశం అంతటా మల్టీ డాల్బీ సినిమా ఉంటుంది. ప్రేక్షకులు దాన్ని అనుభూతి చెందడం థ్రిల్లింగ్‌గా ఉంటుంది'' అన్నారు. ''అన్నపూర్ణ స్టూడియోస్ 50వ సంవత్సరాన్ని జరుపుకుంటున్న సందర్భంగా వర్చ్యువల్ ప్రొడక్షన్‌లో అగ్రగామిగా ఉండడం, దేశంలో తొలి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీ ఫర్ సినిమా–హోమ్‌ను ఏర్పాటు చేయడం గర్వంగా ఉంది. భారతీయ సినిమాలను మ్యాప్‌లో ఉంచడమే మా ప్రయత్నం'' అన్నారు నాగార్జున. అన్నపూర్ణ స్టూడియోస్ ఈడీ సుప్రియ యార్లగడ్డ తదితరులు పాల్గొన్నారు.

ఊహలకు మించి ఉంటుంది

– బాలకృష్ణ



● ఊర్వశి రౌతేలా, శ్రద్ధా శ్రీనాథ్, బాలకృష్ణ, ప్రగ్యా జైస్వాల్

''సంక్రాంతి పండగకి విడుదలైన నా సినిమాలన్నీ ఘన విజయం సాధించాయి. ఈ సంక్రాంతి కానుకగా రిలీజవుతున్న 'డాకు మహారాజ్' కూడా ఘన విజయం సాధిస్తుంది. ఈ చిత్రం గురించి ప్రేక్షకులు ఏం ఊహించుకుంటున్నారో అంతకు మించి ఈ సినిమా ఉంటుంది'' అని బాలకృష్ణ చెప్పారు. బాబీ కొల్లి దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా, బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా కీలక పాత్రలు చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ మూవీ రేపు (ఆదివారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో బాలకృష్ణ మాట్లాడుతూ– ''తిరుపతి తొక్కిసలాట ఘటన నన్ను ఎంతో కలిచివేసింది. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి'.. ఇలా వరుస ఘన విజయాల తర్వాత వస్తున్న 'డాకు మహారాజ్'తో మరో ఘన విజయాన్ని అందుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. బాబీ కొల్లి మాట్లాడుతూ–''నా టీమ్‌తో కలిసి ఎంతో శ్రద్ధగా 'డాకు మహారాజ్' కథని సిద్ధం చేశాను. బాలకృష్ణగారితో ఒకసారి పని చేస్తే మళ్లీ పని చేయాలనిపిస్తుంటుంది'' అని చెప్పారు. సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ– ''ఐదేళ్ల క్రితం వైకుంఠ ఏకాదశి రోజున 'అల వైకుంఠపురములో' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ చేసి, జనవరి 12న ఆదివారం సినిమా విడుదల చేశాం. ఇప్పుడు 'డాకు మహారాజ్'కి కూడా అదే జరిగింది. 'అల వైకుంఠపురములో'లాగే ఈ సినిమా కూడా విజయం సాధిస్తుంది'' అని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ–''కొన్ని సినిమాలకు ప్రాణం పెట్టి సంగీతం చేయాలనిపిస్తుంది. అలాంటి సినిమా 'డాకు మహారాజ్'' అన్నారు. ఈ వేడుకలో వైజాగ్ ఎంపీ భరత్, బాలకృష్ణ కుమార్తె తేజస్విని, కెమెరామేన్ విజయ్ కన్నన్, రచయిత మోహన్ కృష్ణ తదితరులు పాల్గొని, 'డాకు మహారాజ్' చిత్రం ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.



''సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలోని 'బ్లాక్ బస్టర్ పొంగల్...' అనే పాట వెంకటేశ్‌గారికి చాలా నచ్చింది. దీంతో ఆయనే స్వయంగా ఆ పాట పాడతానని చెప్పడంతో నేను షాక్ అయ్యాను. కానీ ఆయన 20 నిమిషాల్లో ఆ పాట పాడటంతో సంగీత దర్శకుడు భీమ్స్ కూడా షాక్ అయ్యాడు'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి చెప్పారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి విలేకరులతో పంచుకున్న విశేషాలు...

సంక్రాంతికే రావాలనుకున్నాం

– అనిల్ రావిపూడి

● వెంకటేశ్‌గారితో నేను తీసిన 'ఎఫ్ 2' (2019) సంక్రాంతికి వచ్చి, విజయం సాధించింది. 'ఎఫ్ 3' కూడా సంక్రాంతికి రావాల్సింది కానీ మిస్ అయ్యింది. మా కాంబోలో మూడో సారి చేసే సినిమాని ఎలాగైనా పండగకి తీసుకొస్తే బావుంటుందని సినిమా ఆరంభం అప్పుడే సంక్రాంతికి రావాలనుకున్నాం. కథ అనుకున్నప్పుడే 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌కి ఫిక్స్ అయ్యాం. 'సంక్రాంతికి వస్తున్నాం' కథ ఒక రెస్క్యూ ఆపరేషన్‌కి సంబధించినది. సెకండ్ హాఫ్‌లో నాలుగు రోజుల ప్రయాణం సంక్రాంతికి ముందు ల్యాండ్ అవుతుంది. ఒక భార్య, మాజీ ప్రేయసి మధ్య నలిగే ఓ భర్త పాత్ర వెంకటేశ్‌గారిది. ప్రతి ఫ్యామిలీ రిలేట్ చేసుకునే సినిమా ఇది. ట్రైలర్ అందరికీ బాగా నచ్చింది. థియేటర్స్‌కి వచ్చాక సినిమా అద్భుతంగా నచ్చితే మూవీ బ్లాక్ బస్టరే. ● కోవిడ్ తర్వాత సినిమా సినారియో మారిపోయింది. మంచి కథ రాసి, గొప్పగా తీస్తే సరిపోదు. థియేటర్స్‌కి జనాలు రాకపోతే సినిమాకి రీచ్ ఉండదు. ఇప్పుడు ఆడియన్స్ బాగా సెలెక్టివ్ అయిపోయారు. మన సినిమా వారి అటెన్షన్‌ని గ్రాబ్ చేస్తేనే ఓపెనింగ్స్ తెచ్చుకోగలమని నా అభిప్రాయం. ఈసారి ప్రమోషన్స్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టాం. వెంకటేశ్‌గారి లాంటి పెద్ద స్టార్ హీరో సరదాగా అల్లరి చేయడం, రీల్స్ చేయడం ప్రమోషన్స్‌కి చాలా హెల్ప్ అయ్యింది. నేను హీరోలకి ఫ్యాన్‌గానే ఉంటాను. రిలేషన్‌ని పాజిటివ్‌గా ఉంచుతాను కాబట్టి వాళ్ల నుంచి కూడా అంతే ప్రేమ వస్తుంది. ● 'దిల్' రాజుగారితో 'పటాస్' సినిమాతో నా ప్రయాణం ఆరంభమైంది. రాజు గారు, శిరీష్ గారు అంటే నా కుటుంబం లెక్క. మాది పదేళ్ల ప్రయాణం. ఇక ఉమెన్ సెంట్రిక్‌గా ఒక స్పోర్ట్స్ స్టోరీ చేయాలని ఎప్పటి నుంచో ఉంది. కొన్నాళ్ల తర్వాత ఆ నేపథ్యంలో మూవీ చేస్తాను. 'ఎఫ్ 4' సినిమా కచ్చితంగా ఉంటుంది. అయితే దానికి ఇంకా సమయం ఉంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకి కూడా ఫ్రాంచైజీలు చేసుకునే అవకాశం ఉంది.

థ్రిల్లర్ రెడీ



● రవి వర్మ, శ్రీవిద్య, పూజా రామచంద్రన్

ధన్యా బాలకృష్ణ, రవి వర్మ, పూజా రామచంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ 'హత్య'. శ్రీవిద్య బసవ దర్శకత్వంలో ఎస్. ప్రశాంత్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రవి వర్మ మాట్లాడుతూ– ''శ్రీవిద్య కొత్త టైప్ ఆఫ్ మేకింగ్‌కి తెర తీసింది. ఈ చిత్రంలో నేను చాలెంజింగ్ రోల్ చేశాను. ఈ మూవీ ఆడియన్స్‌కు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది'' అన్నారు. ''చాలా కాలం తర్వాత 'హత్య' వంటి ఓ డిఫరెంట్ మూవీతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను'' అన్నారు పూజా రామచంద్రన్. ''నా తొలి చిత్రం 'మధ' తరహాలోనే నా రెండో చిత్రం 'హత్య' కూడా థ్రిల్లర్ మూవీ. ప్రేక్షకులు ఈ మూవీని ఆదరించాలి'' అని కోరారు శ్రీవిద్య. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ నరేశ్ కుమారన్ .పి మాట్లాడారు.

ఒక పథకం ప్రకారం....

సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రుతీ సోది, ఆషిమా నర్వాల్ హీరోయిన్లుగా నటించారు. సముద్ర ఖని కీలక పాత్ర చేశారు. వినోద్ కుమార్ విజయన్, గార్లపాటి రమేశ్ నిర్మించారు. ఫిబ్రవరి 7న ఈ చిత్రం విడుదల కానుంది. శుక్రవారం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. వినోద్ కుమార్ విజయన్ మాట్లాడుతూ– ''ఇదొక విభిన్నమైన కథ. అడ్వొకేట్ పాత్రలో సాయిరామ్ శంకర్, పోలీసు పాత్రలో సముద్ర ఖని నటన పోటాపోటీగా ఉంటుంది. ఊహించని మలుపులతో సాగే క్రైమ్, మిస్టరీ కథనాలతో మా సినిమా ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేస్తుంది'' అని పేర్కొన్నారు.



● సాయిరామ్ శంకర్

ఓటీటీ ఇది చూడొచ్చు

నాటి రామాయణం నేటి పాత్రలతో.....

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం సింగమ్ ఎగైన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



మన ఇతిహాసాలలో గొప్ప విలువలతో కూడుకున్న కథ రామాయణం. నాటి రామాయణాన్ని నేటి నేటివిటీతో ప్రస్తుత ప్రముఖ నటీనటులతో మళ్లీ మన ముందుకు తీసుకు వచ్చే ప్రయత్నం చేశారు బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి. ఇదే ప్రయత్నాన్ని గతంలో చాలా మందే చేసినా యాక్షన్ నేపథ్యంలో వచ్చిన 'సింగమ్' సిరీస్ చిత్రానికి ఈ తరహా ప్రయోగం చేయడం మొదటిసారి. అందులోనూ బాలీవుడ్‌లో భారీ తారాగణంతో ఇలాంటి అంశంతో కూడిన కథ తీయడమనేది నిజంగా సాహసమనే చెప్పాలి. ముందుగా 'సింగమ్' సిరీస్ గురించి చెప్పుకుందాం. ఈ సిరీస్‌లో వచ్చిన మూడో చిత్రం 'సింగమ్ ఎగైన్'. సిరీస్‌లో ఈ భాగం ప్రేక్షకుల ముందు రావడానికి దాదాపు పదేళ్లు పట్టింది. 2011లో 'సింగమ్' మొదటి చిత్రం రాగా 2014లో రెండో భాగంగా 'సింగమ్ రిటర్న్స్' విడుదలైంది. ఆ తరువాత మూడో భాగం 2024లో 'సింగమ్ ఎగైన్'గా వచ్చింది. అన్ని సిరీస్‌లలో కథానాయకుడిగా ప్రముఖ స్టార్ అజయ్ దేవగన్ నటించారు. ఇకపోతే ప్రస్తుత 'సింగమ్ అగైన్' చిత్రంలో అజయ్ దేవగన్‌తో పాటు కరీనా కపూర్, దీపికా పదుకోన్, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, అర్జున్ కపూర్ తదితర ప్రముఖ నటులు నటించారు. రామాయణ కథనే ఇతివృత్తంగా అల్లుకున్న కథ ఇది. రామాయణంలోని పాత్రలను రిలేట్ చేస్తూ ఒక్కో పాత్రను పరిచయం చేస్తూ స్క్రీన్‌ప్లే కొనసాగుతుంది. ప్రత్యేకంగా చెప్పాలంటే సినిమాలో రామాయణ కథను టీవీ షో రూపంలో చూపిస్తూ కథను నడిపిస్తారు. అప్పటి రామాయణ కథ చరిత్రతో మనకు పరిచయం. అందుకే అది రమణీయ కావ్యం. కానీ ఇప్పటి 'సింగమ్ ఎగైన్' రణరంగమే ప్రధాన సూత్రంగా నడిచిన కథ. ఆఖరుగా ఒక్క మాట... రామాయణ కథను నేటి తరానికి మళ్లీ చెప్పడమనేది మంచిదే కానీ, ఎన్నో భావావేశాలున్న రామాయణ మూల కథలోంచి ఒక్క శౌర్య, వీర రసం మాత్రం తీసుకుని సినిమా రూపొందించడం ఏమాత్రం సమంజసమో సినిమా తీసిన దర్శక–నిర్మాతలు, చూస్తున్న మనలాంటి ప్రేక్షకులు ఆలోచించాల్సిందే. ప్రైమ్ వీడియో ఓటీటీ వేదికగా ఈ సినిమా స్ట్రీమ్ అవుతోంది. మీరు కూడా చూసి ఆలోచించడం మొదలు పెట్టండి.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.